# దేవుడు చేయని మనుషులు

జి. సి. జీవి

"స్వామీ!"

"ఏమి? ఇంకా ఏమైనా వరాలు కావాలా?"

"అమ్మమ్మ! ఎంతమాట! తమరి దగ్గర కోరవలసినవి నా కింకేమున్నాయి స్వామి! నన్ను మంత్రిని చేస్తిరి. విమాన ప్రమాదం లోంచి నన్ను కాపాడితిరి. మా అబ్బాయిలకి ప్రభుత్వ యంత్రాంగంలో పెద్ద పెద్ద పదవు లిప్పిస్తిరి. మా అల్లుళ్ళకి ఇంపోర్టు లైసెన్సులు మంజూరు చేయిస్తిరి. మా ఆవిడ్ని సెన్సారు బోర్డు మెంబర్ని చేస్తిరి."

"నీకు మనవలూ, మనవరాళ్ళూ లేరా?"

"ఎందుకు లేరు స్వామీ. అంతా కలిసి ఓ డజనుకు పైగానే వున్నారు"

"అయితే వాళ్ళు పెరిగి పెద్దయ్యాక వాళ్ళకి కావాల్సిన పదవులూ, పెళ్ళాలూ మొగుళ్ళూ వుద్యోగాలూ వగైరా వగైరాలకి నా అవసరం లేదా? ఆ వరాలని ఇప్పుడే రిజర్వు చేసి పెట్టుకోవాలని నీకు తోచలేదా?"

"మీరు మరోలా అనుకోకుంటే...'

"ఫరవాలేదు. చెప్పు"

"కొంత కాలంగా ప్రజలకి మీ మీద నమ్మకం సడలిపోతోంది స్వామీ. మీ వునికినే ప్రశ్నిస్తున్నారు. ఇక రానున్న కాలంలో మీ అవసరమే వుండ దంటున్నారు.'

"ఎవడా కూసేది?"

"ఇంకెవరు స్వామీ! సైంటిస్టులు, రేషనలిస్టులు, మార్క్సిస్టులూ వీళ్ళే"

ఈ ప్రపంచాన్ని సృష్టించింది నేనే నని కూడా నమ్మటం లేదా వీళ్ళు?"

"లేదు స్వామీ. అదేదో "బిగ్ బ్యాంగ్ థీరి" అట.

ఈ విశ్వ మంతా మొదట్లో ఒకచిన్న బిందువుగా వుండేదిట. అది పగిలి, వ్యాకోచించి ఈ విశ్వాంతరాళం ఏర్ప డిందని ఏదో చెబుతున్నారు"

"పోనీ ఆ బిందువుని ఎవరు సృష్టించారుట?"

"అదే పుట్టిందట"

"ఏడిశారు"

"ఇంకా కొందరు ఏమనంటున్నా రంటే స్వామీ- "ఈ ప్రపంచాన్ని సృష్టించింది దేవుడే అనుకో. అయితే ఏం-వాడితో నాకేం పని?' అంటు న్నారు స్వామీ"

"అంటే వాళ్ళ వుద్దేశం?"

'ఈ భూమ్మీద ఇంత మంది పేద వాళ్ళని, పతితుల్ని, భ్రష్టుల్ని, బాధా సర్పదష్టుల్ని తాడితుల్ని, పీడితుల్ని, సృష్టించి చూస్తూ వూరుకున్న వాడూ

ఒక దేవుడేనా? ఏదీ కపినించమను. చీల్చి చెండాడుతాం" అంటున్నారు స్వామీ"

"ఇది మరీ బాగుంది! నేనేం పిచ్చోడ్నా. ఈ బీదాబిక్కీ జనాన్ని సృష్టించటానికా? అసలు వీళ్ళు నాకేం ఒరగబెడతారని పనిగట్టుకుని వీళ్ళను సృష్టిస్తాను. వీళ్ళు నాకేమైనా పూజలూ పునస్కారాలూ చేయగలరా? కానుక లివ్వగలరా, కళ్యాణాలు చేయించగలరా? పట్టు పీతాంబరాలివ్వగలరా? పంచభక్ష్య పరమాన్నాలు నైవేద్యాలు పెట్టగలరా? బంగారు తొడుగుతో గోపురాలు కట్టింప గలరా? వీళ్ళు నాకేమివ్వగలరని పని గట్టుకొని వీళ్ళని సృష్టిస్తాను?

ఇ తకీ తమరు ?

'అవునయ్యా! ఈ గోచిపాత రాయు ళ్ళని నేను సృష్టించలేదు. వీళ్ళకీ నాకూ ఎటువంటి సంబంధమూ లేదు. ఈ మాటే చెప్పు ఈసారి మీ వాళ్ళందరి తోటీ."

"చిత్తం"

---

(33-వ పేజీ తరువాయి)

దృక్పథం గల దర్శకులు 'ఇంటర్ నేషనల్ ఫిల్మ్ డైరెక్టర్స్ ఫోరమ్' మేరకు ఒక తాటి మీదకు వచ్చారు. ఓస్మాన్, సెంబేన్, లిట్టెన్, రే, మృణాల్, బాసు ఛటర్జీ మొదలైన పెద్ద లందరూ దీనికి తుది రూపమిస్తున్నారు.

ఇప్పుడు చలన చిత్ర స్వరూపం మారాలి. ఈ ఉద్యమానికి జనత అం దించే సహకారంమీదనే - ఈ మార్పు- ఈ విప్లవం ఆధారపడి వుంటాయి.

## హిప్పీలు!

పులిచేరి రామమోహనరావు

ఊర్వశి శాపాన్ని
ఇంద్రుని సవరణ ద్వారా
వరంగా వాడుకున్న వాడై,
అజ్ఞాత వాసానంతరం
బృహన్నల వేషాన్ని విసర్జిస్తూ
అంతఃపుర ప్రవేశానికి
అయాచితంగా లభించిన
ప్యాస్‌పోర్టులాంటి వేషాన్ని
ఆపదలో ఆదుకున్న నేస్తాన్ని
అంతలోనే వీడవలసి రావడంతో
పార్థుడు మనస్సులో
కించిత్ బాధపడ్డాడట!
అర్జునుని ఆవేదనను
పరమాత్మ పసిగట్టి
"అర్జునా! ఇరవైయో శతాబ్దంలో
పలాయన వాదంలో
పరాకాష్టనందుకున్న
యువతీ యువకులు
ఆడా మగా తేడా తెలియని విధంగా
హిప్పీలై మసలుతారు!
అనాడు, నీ ఈ వేషానికి
సార్వజనీనత లభిస్తుంది;
ఊరడిల్లు మన్నాడట.
అన్నా! ఈ మార్పు
మన తరానికి వరమా?
రానున్నది
మరో కురుక్షేత్ర సమరమా?